ప్రాణాలతో చెలగాటం

- రైలు పట్టాలపై ప్రమాదకరంగా దాటుతున్న ప్రయాణికులు
- నివారించకుంటే ప్రమాదం తప్పదు


రైలు పట్టాలపై వెళ్తున్న ప్రయాణికులు

నెల్లూరు(క్రైమ్) : ప్రయాణికులు తెలిసీ తెలియక చేసే తప్పులు.. పెద్ద పెద్ద ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రైలు పట్టాల గుండా వెళ్లడం, రైలుపట్టాలను దాటడం వల్ల ఎంతో మంది రైళ్లు ఢీకొని మృత్యువాత పడుతున్నారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ లోపలకు వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు రెండు ప్రధాన ద్వారాలున్నాయి. అధిక శాతం ప్రయాణికులు ఇలా వెళ్తే ఆత్మకూరు బస్టాండు, బోసుబొమ్మ దూరం అవుతుందని భావించి తొందరగా చేరుకోవాలన్న తాపత్రయంతో రైలుపట్టాలపై నడుచుకుంటూ, పట్టాలను దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చివరి నిమిషంలో మార్పులు

నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో రోజూ సుమారు వందకు పైగా ప్యాసింజర్స్ రైళ్లు ఆగి వెళ్తుంటాయి. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఉంటోంది. సాధారణంగా విజయవాడ వైపు వెళ్లే రైళ్లు రెండో నంబర్ ప్లాట్‌ఫారమ్‌లో, గూడూరు వైపు వెళ్లే రైళ్లు మూడో నంబర్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆగుతుంటాయి. అయితే పలు సందర్భాల్లో రైళ్ల రద్దీ దృష్ట్యా నాలుగో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై కొన్ని రైళ్లకు హాల్టింగ్‌ను ఇస్తున్నారు. చివరి నిమిషంలో ఇలా మార్పులు చేయడం వల్ల ప్రయాణికుల్లో గందరగోళం నెలకొని పట్టాలపైకి వచ్చి ప్లాట్‌ఫారమ్‌లను మారుతున్నారు. దీనివల్ల కూడా పలు సందర్భాల్లో రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వినియోగంలో లేకపోవడంతో..

ఈ రైల్వేస్టేషన్‌లో రెండు ఎంట్రీ మార్గాలు ఉండగా ఎక్కువ మంది ప్రయాణికులు తూర్పు టెర్మినల్‌ను వినియోగిస్తారు. అందులోని ప్రధాన బిల్డింగ్‌లో టికెట్ తీసుకుని పక్కనే ఉండే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ద్వారా ప్లాట్‌ఫారమ్ మారుతారు. అయితే ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఆధునికీకరిస్తున్నారు. దీనివల్ల ప్రయాణికులు తప్పనిసరిగా అండర్ పాస్ మార్గం గుండా ప్లాట్‌ఫారాలు మారాల్సి ఉంటోంది. అయితే తూర్పు టెర్మినల్‌కు వెళ్లేందుకే చాలా మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. అలా వెళ్లిన వారు టికెట్ తీసుకుని మళ్లీ కిందకు వచ్చి అండర్ పాస్ గుండా వెళ్లడం పెద్దలకు చాలా కష్టం. దీనివల్ల కూడా ప్రయాణికులు రైలు పట్టాల గుండా ప్లాట్‌ఫారమ్‌లను మారుతున్నారు.

నిఘా ఏది?

రైలు పట్టాలపై రాకపోకలు చట్టరీత్యా నేరమని, రైల్వే చట్టం ప్రకారం శిక్షార్హులు అని ఆర్పీఎఫ్ పోలీసులు గతంలో ప్లాట్‌ఫారమ్‌లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా నిరంతరం ప్రయాణికులను వెళ్లనీయకుండా అవగాహన కల్పిస్తూ హెచ్చరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. దీంతో ప్రమాదమని తెలిసినప్పటికీ ప్రయాణికులు మాత్రం రైలు పట్టాలపై వెళ్తున్నారు. నగరంలోని రంగనాయకులపేట, ఆత్మకూరు బస్టాండ్ రైల్వే వంతెన, నక్కలోళ్ల సెంటర్, విజయ మహల్‌గేటు, ఎం–2 థియేటర్ ఎదురుగా, సౌత్ రైల్వేస్టేషన్, కొండాయపాలెం గేటు, వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీప రైలుపట్టాలపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో రైల్వే పోలీసులు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడంతో పాటుగా పట్టాలపై ప్రయాణికులు నడవకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అదేక్రమంలో ప్రయాణికులు కూడా ఆలస్యమైనా ప్రధాన ద్వారాల గుండా వెళ్తే గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవచ్చు. తొందరపాటుతనంతో పట్టాలపై రాకపోకలు సాగిస్తే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది.

చట్టరీత్యా నేరం

> రైలు పట్టాలపై రాకపోకలు చట్టరీత్యా నేరం. పట్టాలపై నడుచుకుంటూ వెళ్తూ, దాటుతూ కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా వెళ్లే వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేస్తున్నాం. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీని ఏర్పాటు చేశాం.
> – జి.మాలకొండయ్య, నెల్లూరు రైల్వే ఎస్సై


ప్రమాదకరంగా పట్టాలు దాటి ప్లాట్‌ఫారమ్ ఎక్కుతూ..



గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు (ఫైల్)

ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 9.30 గంటలకు భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ సంఘం భవనంలో జరుగనుందని ఆ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. జిల్లా ఆడిట్ అధికారి ఎం.తిరుపతయ్య ముఖ్యఅతిథిగా హాజరై, పెన్షన్ మంజూరు, జీపీఎఫ్ ప్రతిపాదనలు తదితర విషయాలను వివరించడంతో పాటు పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అలాగే 'ఎనెల్' హాస్పిటల్‌కు చెందిన జనరల్ ఫిజిషియన్ డాక్టర్ పి.హరికృష్ణ వయోభారంతో వేసవికాలంలో ఎదురయ్యే పలు ఆరోగ్య సమస్యలతో పాటు రోజువారీ తలెత్తే వివిధ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశానికి జిల్లాలోని పెన్షనర్స్‌తో పాటు, అసోసియేషన్ బాధ్యులు తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మాల కార్పొరేషన్ చైర్మన్ రాక నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ జిల్లాకు రానున్నారని ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ ఎ.నిర్మలాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రానికి జిల్లాకు చేరుకుంటారని, శనివారం ఉదయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం, విలేకరుల సమావేశం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

గాన నీరాజనం రేపు


ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావును స్మరిస్తూ ఆదివారం సాయంత్రం గాన నీరాజనం కార్యక్రమం ఉంటుందని శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ తెలిపారు. స్థానిక నర్తకిసెంటర్‌లో వారు ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆర్.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, తులసీరాంచే పండరిభజన, సాయంత్రం 6 గంటలకు శాంతి ఈవెంట్స్ వారి సంగీత విభావరి, గాన నీరాజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. నిర్వాహకులు కేతా సుబ్బారావు, జి.అంకిరెడ్డి, బి.రఘురామిరెడ్డి, ఎం.ఫ్రాన్సిస్, వి.మహేష్ పాల్గొన్నారు.

ఏపీకి ఎంతో చేశాం


మాట్లాడుతున్న లంక దినకర్

నెల్లూరురూరల్ : కేంద్ర ప్రభుత్వం పథకాలు, గ్రాంట్ల రూపంలో ఏపీకి ఎంతో చేసిందని 20 సూత్రాల కార్యక్రమ కమిటీ అమలు చైర్మన్ లంక దినకర్ తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజధాని అమరావతికి, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అలాగే జాతీయ రహదారులకు బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం కేటాయించామని తెలిపారు. త్వరలో విశాఖ రైల్వే జోన్ ప్రారంభమవుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి పంపిణీ



నెల్లూరు(బృందావనం) : ఆమంచర్లలోని లెప్రసీ కాలనీకి చెందిన 35 కుష్టు బాధిత కుటుంబాలకు నిత్యావసర సామగ్రిని శుక్రవారం అందజేసినట్లు అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ మారెళ్ల టైటస్ నిర్మల్‌కుమార్ తెలిపారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. డాక్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్, శశి, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు (టౌన్) : స్థానిక బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జీవీఆర్ఆర్ కళాశాల, జనహిత వాత్సల్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, ప్రిన్సిపల్ రవికుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ జీఎం తనిఖీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్‌కు సంబంధించి గూడూరులో ఉన్న మెటీరియల్ స్టోర్స్‌ను ఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్స్‌లో ఉన్న విద్యుత్ సామగ్రి నాణ్యత, రికార్డులను పరిశీలించారు. అనంతరం నగరంలోని విద్యుత్ భవన్‌లో అకౌంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్ఈ విజయన్, అకౌంట్ ఆఫీసర్ విజిత, జిల్లా స్టోర్స్ ఈఈ శంకరయ్య, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సురేఖ, ఏఈలు మల్లికార్జున, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక అనుమతులు మంజూరు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లాలోని సాంఘిక హాస్టల్ భవనాల మరమ్మతులకు ప్రభుత్వం ఆర్థిక అనుమతులు మంజూరు చేసిందని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 32 సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేపడుతున్నామని, ఇందుకు ప్రభుత్వం రూ.72 లక్షల మంజూరుకు అనుమతులు ఇచ్చిందన్నారు.

భూగర్భ డ్రెయినేజీ పనులు వేగవంతం

- కమిషనర్ సూర్యతేజ


అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : భూగర్భ డ్రెయినేజీ పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటి నుంచి కనెక్షన్ తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 49వ డివిజన్‌లోని బీఈడీ కాలేజీ, ప్రభుత్వ మోడల్ హైస్కూల్, దోర్నాలవీధి, ఈద్గామిట్ట, గుండాల సుబ్బారెడ్డి తోట, జయలలిత నగర్, పాత మున్సిపల్ ఆఫీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో ఏసీ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అదేలా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. చల్లటి, సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎస్ఈ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రహంతు జానీ, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయాతుల్లా, ఏసీపీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం


ఇస్మాయిల్, ఇబ్రహీంలను సన్మానిస్తున్న మత పెద్దలు

నెల్లూరు(బృందావనం) : ప్రశాంత జీవనానికి బాల్యం నుంచే ఆధ్యాత్మిక చింతన, పవిత్ర గ్రంథ పఠనం ఎంతో అవసరమని పొర్లుకట్ట బదర్ మసీదు కమిటీ అధ్యక్షుడు, మతపెద్ద జనాబ్ షౌకత్ హుస్సేన్ తెలిపారు. పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర ఉన్న పొర్లుకట్ట బదర్ మసీదులో హాఫిజ్ ఖురాన్ (ఖురాన్‌ను కంఠస్థం చేయడం, బోధించడం) చేసిన విద్యార్థులు హాఫిజ్ ఇస్మాయిల్, హాఫిజ్ ఇబ్రహీంలను మతపెద్దలు శుక్రవారం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా షౌకత్ హుస్సేన్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి మసీదులో పెద్దలు వారి ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఇమామ్ హాఫిజ్ ఖలీల్ అహ్మద్, డాక్టర్ రఫీ, అఫ్సర్, జిలానీ, యాకుబ్‌ఖాన్, మస్తాన్ పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో స్వచ్ఛ దివస్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేడియం ప్రాంగణంలో చెత్తను తొలగించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ పాబోలు సత్యం, సెక్రటరీ స్నేహ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


రామచంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు


పప్పులవీధిలోని ప్రాథమిక పాఠశాలలో..

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవి మెట్టు రామచంద్రప్రసాద్ హాజరై, మాట్లాడుతూ మాతృభాషలోనే అధ్యయనం చేయడం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందుతారన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరి, అధ్యాపకులు చెంచుకామయ్య, సురేంద్ర, కరుణశ్రీ, సత్యనారాయణ, సుభాషిణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక పప్పులవీధిలోని నగర ప్రాథమిక పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి ఆలూరు శిరోమణి శర్మ తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం శర్మ దంపతులను సత్కరించారు. హెచ్ఎం శైలజ పాల్గొన్నారు.

అమ్మణ్ణికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు, పల్లకిసేవను శుక్రవారం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

➡ వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ ప్రాంతాలతో పాటు శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం, శెట్టిగుంటరోడ్డు, జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

➡ రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్, ఏసీ నగర్ మెయిన్‌రోడ్డు, గౌడ హాస్టల్ సెంటర్, పూలే బొమ్మ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. అలాగే తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో శివాజీ నగర్, ఎన్‌సీసీ కాలనీ, డైకస్‌రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్ ఇస్కాన్‌సిటీలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు, డ్రెయిన్ పనులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గత 8 నెలల్లో డివిజన్ పరిధిలో రూ.3 కోట్లను అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు.

4న లా కళాశాల జ్యూరీస్ ఫెస్ట్

నెల్లూరు (టౌన్) : వీఆర్ లా కళాశాల 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 4వ తేదీన ఆర్వీఎస్ కల్యాణ మండపంలో జ్యూరీస్ ఫెస్ట్ 2కే25ను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా లా కళాశాల స్పెషల్ ఆఫీసర్, జేసీ కార్తీక్‌ను ఆహ్వానించారు. ఇందులో జూనియర్స్ ఆత్మీయ సమ్మేళనం, సీనియర్స్ వీడ్కోలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

'మీ-సేవ' సమస్యల పరిష్కారానికి చర్యలు



నెల్లూరు (పొగతోట) : మీ–సేవ సర్వీస్ ప్రొవైడర్ల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారని మీ–సేవ అసోసియేషన్ నాయకుడు అనిల్‌కుమార్ తెలిపారు. అమరావతిలో గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్, కమిషనర్ రామ్‌నాథ్‌రెడ్డిలను శుక్రవారం కలిసి సర్వీసు ప్రొవైడర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ త్వర లో పూర్తిస్థాయిలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నాయకులు హమీద్, రవి, అంజన్, సారథి, గుప్తా పాల్గొన్నారు.

పోలీస్‌శాఖకు బ్రీత్‌ఎన్‌లైజర్ల వితరణ


బ్రీత్‌ఎన్‌లైజర్లతో ఎస్పీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నెల్లూరు(క్రైమ్) : రెడ్‌క్రాస్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆరు బ్రీత్ ఎన్‌లైజర్లను శుక్రవారం అందజేశారు. రోడ్‌సేఫ్టీ కమిటీ సమన్వయ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు బ్రీత్ ఎన్‌లైజర్లను అందించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ మేరకు ఎస్పీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వైస్ చైర్మన్ సీహెచ్ జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, మెంబర్లు కె.శ్రీహరిరెడ్డి, వై.సురేష్, మస్తానయ్య, సౌత్‌ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సంరక్షణకు కృషి


ఇంతియాజ్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం) : హక్కుల సంరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ జనరల్ సెక్రటరీ, మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ తెలిపారు. నగరంలోని బారెక్స్ మసీదు (బారకాసు మసీదు)లో ఆయన్ను శుక్రవారం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్‌బాషా పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు నివాళి



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శ్రీకృష్ణదేవరాయలు జయంతి సభను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయలు, పూనూరు ఆదిరెడ్డి, పోలారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 'శ్రీకృష్ణదేవరాయల సాహిత్య వైభవం'పై విశ్రాంత వీసీ ఎ.కుసుమకుమారి ఉపన్యసించారు. బత్తిన సాయికుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుసుమకుమారిని సన్మానించారు. నిర్వాహకుడు పూనూరు సాయికుమార్‌రెడ్డి, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, ఇందిర, విమల, జయప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన భారీ వాహనం

- స్తంభించిన ట్రాఫిక్



నెల్లూరు(క్రైమ్) : నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వైపు నుంచి వరికోత మెషీన్ను తరలిస్తున్న ఓ మినీలారీ శుక్రవారం సాయంత్రం మాగుంట లేఅవుట్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద చిక్కుకుపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న సౌత్ ట్రాఫిక్ ఆర్ఎస్సై చంద్రమౌళి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని ముందుకు కదిలించడంతో మెషీన్ పైభాగం ఓ పక్కకు ఒరిగిపోయింది. అది పడిపోయే అవకాశం ఉండటంతో కొద్దిసేపు అటువైపుగా వెళ్లే వాహనాలను నిలిపివేశారు. ఓ పక్కగా వాహనాన్ని తరలించిన అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆప్కాస్ రద్దు చర్యలు ఆపాలి



నెల్లూరు(బారకాసు) : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ నగర్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు శుక్రవారం నిరసన ధర్నా చేపట్టారు. ఆప్కాస్‌ను రద్దు చేసే చర్యలు ఆపాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నగర నేత పి.సూర్యనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.కామాక్షమ్మ మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేయడం తగదన్నారు. సీఐటీయూ నాయకులు అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి, మురళీ, శ్రీధర్, యూనియన్ నేతలు తాళ్లూరు భాగ్యమ్మ, దయామణి, చిన్న, అలీసమ్మ పాల్గొన్నారు.

నూతన భవనాలను మంజూరు చేయాలి


రామ్‌ప్రసాద్ సిసోడియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీఆర్ఎస్ఏ నేతలు

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఇతర శాఖల కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు, నుడా కార్యదర్శి అల్లంపాటి పెంచలరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రామ్‌ప్రసాద్ సిసోడియాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్–2 వీఆర్వోలను తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డానియేల్ పీటర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి పాల్గొన్నారు.

➡ **నెల్లూరు సిటీ** : రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ్‌ప్రసాద్ సిసోడియాను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీ పుష్పలత, డీఆర్ బాలాంజనేయులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వివరాలు తెలిపారు.

నోటీసులు జారీ చేయాలి


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డు ప్లానింగ్ కార్యదర్శి తమ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, అనుమతుల్లేని నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ పద్మజ, టీపీఓలు వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.